జిల్లా దవాఖానలో నవజాత శిశువు మృతి

కామారెడ్డి, జనవరి 9 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో నవ జాత శిశువు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచకు చెందిన భవానికి బుధవారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో జిల్లా దవాఖానకు ప్రసవం కోసం కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారని కుటుంబీకులు తెలిపారు. ఆపరేషన్ చేయాలని వేడుకున్నా వైద్యులు వినిపించుకోలేదన్నారు. నొప్పులు ఎక్కువ కావడంతో గురువారం తెల్లవారుజామున 4 గంటలకు ఆపరేషన్ చేయగా ఆడపిల్ల జన్మించింది. మొదటి కాన్పులో మహాలక్ష్మి పుట్టిందని సంతోషించే లోపు శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపించారు. దీనిపై దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఫరీదాను వివరణ కోరగా వైద్యుల నిర్లక్ష్యం లేదని, బుధవారం 17 డెలివరీ కేసులు రాగా అందులో 11 కేసులను ఆపరేషన్ చేశామని, మిగిలిన ఆరు నార్మల్ డెలివరీ చేశామని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం లేదని పుట్టుబోయే బిడ్డ ఆరోగ్యంగా లేక పోవడంతో మృతి చెందిందని తెలిపారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కామారెడ్డిలో ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జనవరి 9 : టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకు మహిళలు ప్రతి ఇంటి ఎదుట ముగ్గులు వేసి సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తారని తెలిపారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, సహ అధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షుడు సాయిలు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

నస్రుల్లాబాద్, జనవరి 9 : మండల కేంద్రంలోని రామాలయ ప్రాంగణంలో కోనేరు శశాంక్ ఆధ్యర్యంలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. యువతులు, మహిళలు, విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొని, రంగు రంగుల ముగ్గులు వేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార, మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు సతీశ్, రాములు, యాదగిరిగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

బీఆర్ఎస్‌పై మాట్లాడే నైతిక హక్కు జూపల్లికి లేదు..

బీఆర్ఎస్ నాయకుడు షేక్ జుబేర్

బాన్సువాడ, జనవరి 9 : బీఆర్ఎస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు మంత్రి జూపల్లి కృష్ణారావుకు లేదని బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ అన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలోనే మంజూరైన పనులు అమృత్ 2.0. అని, ఎక్సైజ్ కార్యాలయ భవనాన్ని కూడా గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే నిర్మించిందన్నారు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తామే పనులు చేసినట్లు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారని విమర్శించారు. ఇటీవల బాన్సువాడకు వచ్చిన మంత్రి జూపల్లి ఓ సభలో గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపించారని, కానీ.. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే రూ.లక్షా 30 వేల కోట్లు అప్పుచేశారని, అది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలోనే అన్ని రంగాలను అభివృద్ధి పర్చామని, రాష్ట్ర ఆదాయాన్ని పెంచామన్నారు.

బాన్సువాడ నియోజక వర్గంలో సుమారు రూ.11 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేసింది నిజంకాదా అని ప్రశ్నించారు. ఇవన్ని మర్చిపోయిన కాంగ్రెస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నారని, విమర్శించే ముందు ఆలోచించుకోవాలని హితవు పలికారు. గత ఎన్నికల్లో ఎంపీ సురేశ్ శెట్కార్ బాన్సువాడ నియోజకవర్గం మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం ఆ ఊసే లేదని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ లో ఉన్న ఇప్పటి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ బాన్సువాడను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ధర్నా చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉందని, బాన్సువాడను జిల్లాగా మార్చేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాబోవు స్థానికపోరులో గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. ప్రజలు, రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసహనంతో ఉన్నారని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మళ్లీ అధికారంలోకి తేవడం ఖాయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు మోచి గణేశ్, చాకలి సాయిలు, మధు, మహేశ్, రమేశ్ యాదవ్, మౌలా, శివసూరి, గౌస్, సంజావ్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్

న్యాయ సహాయంపై అవగాహన

బాన్సువాడలోని మున్సిఫ్ కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న న్యాయమూర్తి టీఎస్‌పీ భార్గవి

బాన్సువాడ, జనవరి 9 : బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్, కోర్టు న్యాయమూర్తి టీఎస్‌పీ భార్గవి ఆధ్వర్యంలో న్యాయ సహాయంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులను పెట్టుకునే స్థోమత లేని ఖైదీలకు న్యాయ సహాయం అందించాలని, న్యాయ సహాయంపై పలు సూచనలు చేశారు. న్యాయ సహాయంపై అవగాహన కల్పించాలని న్యాయ మూర్తి సూచించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎంఏ ఖలీల్, మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ మూర్తి, మొగులయ్య తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాచారెడ్డి, జనవరి 9 : మండల కేంద్రంతోపాటు పాల్వంచ మండలంలోని వాడి గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టుకున్న ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఎంఈవోకు సన్మానం

లింగంపేట, జనవరి 9: మండలంలో ఎంఈవోగా సుదీర్ఘకాలం విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన రామస్వామిని మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి రామస్వామికి పూలమాలలు, శాలువాలు కప్పి, జ్ఞాపిక అందించి సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో షౌకత్ అలీ, పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు రవీంద్రశర్మతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అందజేత

మాచారెడ్డి, జనవరి 9 : మండలంలోని గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్‌కు చెందిన షారుఖ్ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్‌చేసి ఫోన్‌ను బాధితుడికి గురువారం అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

పురుగుల మందు దుకాణాల తనిఖీ

బీర్కూర్‌లో పురుగుల మందు దుకాణాలను తనిఖీ చేస్తున్న డీఏవో తిరుమలప్రసాద్

నస్రుల్లాబాద్, జనవరి 9 : నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో గురువారం పురుగుల మందు దుకాణాలను డీఏవో తిరుమల ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫెర్టిలైజర్ స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు లేని మందులు అమ్ముతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పరిమితికి మించి యూరియాను ఇవ్వకూడదని, అవసరమున్న రైతులకు మాత్రమే యూరియా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ శ్రీనివాస్, మానీటర్ అధికారి నర్సింహులు, ఏవో భవానీ, ఏఈవోలు ఉన్నారు.

కోచ్‌గా అనిల్ కుమార్ ఎంపిక

కామారెడ్డి, జనవరి 9 : ఈ నెల 12వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నిర్వహించే 59వ జాతీయ స్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టు కోచ్‌గా కామారెడ్డి జిల్లాకు చెందిన అనిల్‌కుమార్ ఎంపికైనట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్స్, కార్యదర్శి సారంగపాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, సభ్యులు తదితరులు అభినందించారు.

'చెత్త' శుద్ధి ఏది?

- మున్సిపల్ కార్యాలయం పక్కనే పేరుకుపోయిన చెత్త
- పట్టించుకోని సిబ్బంది
- నివ్వెరపోతున్న ప్రజలు

కామారెడ్డి, జనవరి 9 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం గోడపక్కనే చెత్త ఉన్నా మున్సిపల్ సిబ్బందికి కనిపించడం లేదు. చెత్తను శుభ్రం చేయాల్సిన మున్సిపల్ సిబ్బంది తమ కార్యాలయం పక్కనే చెత్త ఉండడంతో ప్రజలు నివ్వెరపోతున్నారు. మున్సిపల్ కార్యాలయం గోడకు ఆనుకొని ఇలా చెత్త ఉంటే పట్టణం పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కార్యాలయం గోడ పక్కనే వేసిన చెత్త

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పోలీసులు

రామారెడ్డి, జనవరి 9 : జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పోలీస్ వారి ఆధ్వర్యంలో సదాశివనగర్ మండలం మల్లన్న గుట్ట మహిళా సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ సంతోష్‌గౌడ్, స్థానిక ఎస్సై రంజిత్, ఎంవీఐ మహేశ్ హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్‌రూల్స్, వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైవింగ్ లైసెన్స్ ఎలా పొందాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 'మై రోల్ ఇన్ మేకింగ్ తెలంగాణ ఏ డ్రగ్ ఫ్రీ స్టేట్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ మీనా, డాక్టర్ శ్రావణి, అకడమిక్ కో-ఆర్డినేటర్ వనజ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఏర్పాటు చేయాలని వినతి

రామారెడ్డి, జనవరి 9 : మండలంలోని అన్నారం గ్రామంలో వ్యవసాయ సహకార సంఘ ఏర్పాటుకు ఇటీవల ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగా, విషయం తెలుసుకున్న రెడ్డిపేట గ్రామస్తులు తమ గ్రామంలో సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని గురువారం ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేశారు. అన్నారంలో ఏర్పాటు చేస్తే మద్దికుంట, రెడ్డిపేట, స్కూల్‌తండా, బట్టుతండా తదితర గ్రామాలకు అన్నారం దూరం అవుతుందన్నారు. మద్దికుంట-రెడ్డిపేట సబ్‌స్టేషన్ వద్ద రెండు గ్రామాలకు చెందిన 30 గుంటల స్థలం ఉన్నదని, ఆ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే అన్ని గ్రామాలకు మధ్యలో ఉండి అనుకూలంగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

బడి బయటి విద్యార్థి పాఠశాలలో చేరిక

నిజాంసాగర్ ఉన్నత పాఠశాలలో బడిబయటి విద్యార్థిని చేర్పిస్తున్న సీఆర్పీ నర్సింహులు

నిజాంసాగర్, జనవరి 9 : ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జనవరి 8 నుంచి 15 రోజుల వ్యవధిలో బడి బయటి పిల్లలను గుర్తించాలని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ నరసింహారెడ్డి ఆదేశించారు. అందులో భాగంగా గురువారం మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామంలో సీఆర్పీ నర్సింహులు గ్రామానికి చెందిన అంద్యాల అర్జున్ అనే విద్యార్థి నిజాంసాగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతూ మధ్యలో ఆపివేశాడని తెలుసుకొన్నారు. అర్జున్‌కు తల్లిదండ్రులు లేని కారణంగా తాత అంద్యాల పర్వయ్య వద్ద ఉంటున్నాడు. మూడు, నాలుగు నెలల నుంచి పాఠశాలకు వెళ్లడం లేదు. దీంతో సీఆర్పీ నర్సింహులు గురువారం వారి ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి విద్యార్థిని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశం సమక్షంలో పాఠశాలలో చేర్పించారు.

నాగన్న బావి కట్టడం.. ఓ అద్భుతం

- జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దయానంద్

లింగంపేట, జనవరి 9: మండల కేంద్రంలోని పురాతన నాగన్న బావి కట్టకం అద్భుతంగా ఉన్నదని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దయానంద్ అన్నారు. మండల కేంద్రంలోని నాగన్న బావిని ఆయన మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నాగన్న బావి చరిత్రను వారు తెలుసుకున్నారు. దయానంద్ మాట్లాడుతు రాళ్లు, డంగు సున్నంతో సౌందర్యాత్మకంగా, పటిష్టంగా నిర్మించినట్లు వివరించారు. ఇన్ఫోసిస్ సంస్థ వారి సహకారంతో, కలెక్టర్ ప్రత్యేక చొరవతో బావిని ఆధునీకరించడం సంతోషంగా ఉన్నదన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో తొలి మైనార్టీ ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త షేక్‌ఫాతిమా జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రీజినల్ కో-ఆర్డినేటర్ కిరణ్‌గౌడ్, ప్రిన్సిపాల్ వెంకటరాములు, పాఠశాల సమన్వయకర్త రాంగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగన్న బావిని సందర్శిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు

నేటి పాదయాత్రను విజయవంతం చేయండి

లింగంపేట(తాడ్వాయి), జనవరి 9: తాడ్వాయి మండల కేంద్రం నుంచి కామారెడ్డి కలెక్టరేట్ వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యలో శుక్రవారం నిర్వహించనున్న 'రైతు పోరుబాట పాదయాత్ర'ను విజయవంతం చేయాలని తాడ్వాయి సహకార సంఘం చైర్మన్, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి కోరారు. తాడ్వాయిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసాకు ప్రకటించిన విధంగా 15వేల రూపాయలు అందించాలన్నారు. సన్న రకం ధాన్యానికే కాకుండా రైతు పండించిన ప్రతి పంటకూ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ముదాం నర్సింహులు, రాజారెడ్డి, మంగారెడ్డి, సంజీవులు, రమేశ్, వెంకట్రావు, రాజారెడ్డి, తిరుపతిరెడ్డి, శివాజీ, చిన్న లింగం తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

నాగిరెడ్డిపేట, జనవరి 9: మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగాలని డీపీఎం సుధాకర్ అన్నారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో గురువారం నూతన మాక్స్ చట్టం, ఉపనిధులపై మహిళా సమాఖ్య, సీసీ, సీఏలకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తున్నదన్నారు. ప్రతి మహిళనూ సంఘాల్లో సభ్యురాలిగా చేర్చుకోవాలన్నారు. 1395 మ్యాక్స్ చట్టం ప్రకారం ఇప్పటి వరకు మండల సమాఖ్యలు కొనసాగాయని, ఇక నుంచి నూతన మ్యాక్స్ చట్టం ప్రకారం నడుచుకోవాలని పేర్కొన్నారు. సభ్యురాలు కచ్చితంగా రూ.100 చెల్లించి సంఘ సభ్యురాలిగా చేరాలని, ప్రతి యేటా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం జగదీశ్, సమాఖ్య అధ్యక్షురాలు శాంత, సీసీలు దత్తు, రమేశ్, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, రషీద్, ఆయా గ్రామాల సంఘ సభ్యులు, సీఏలు పాల్గొన్నారు.

చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు

కామారెడ్డి, జనవరి 9 : దేవునిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఒకరిపై కేసు నమోదు చేసి 65 బెండల్స్ చైనా మాంజా సీజ్ చేసినట్లు ఎస్సీ సింధూశర్మ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎవరైనా చైనా మాంజా విక్రయించినా, దాంతో ఎవరికైనా ప్రమాదం జరిగినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మాంజా విక్రయించే దుకాణాలపై అధికారులు దాడులు చేస్తారని తెలిపారు. ఎవరైనా చైనా మాంజాను అమ్మితే 1986 చట్టం ప్రకారం ఏడేండ్లు జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే టాస్క్ ఫోర్స్ లేదా సీసీఎస్ సీఐ శ్రీనివాస్ 8712686112 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

మాంజాను పరిశీలిస్తున్న ఎస్సై విజయ్

కైట్స్ షాప్ తనిఖీ..

మద్నూర్, జనవరి 9:చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై విజయ్ కొండ అన్నారు. గురువారం గాలి పటాలు అమ్మే దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. చైనా మాంజా అమ్మరాదని, ఎవరైనా అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చైనా మాంజా వల్లే కలిగే నష్టాలు, ఇబ్బందులను ఆయన ప్రజలకు వివరించారు.

మోతిబిందు నిర్ధారణ శిబిరం

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 9: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, లయన్స్ కంటి దవాఖాన బాన్సువాడ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి సీహెచ్‌సీలో గురువారం ఉచిత మోతిబిందు నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసినట్లు నేత్ర వైద్య సహాయ అధికారి హరికిషన్‌రావు తెలిపారు. శిబిరంలో 54మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, తొమ్మిది మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించి వారిని ఆపరేషన్ నిమిత్తం బాన్సువాడ లయన్స్ కంటి దవాఖానకు రిఫర్ చేశామన్నారు. 22మందికి దృష్టిలోపాలు ఉన్నట్లు గుర్తించి వారికి కంటి అద్దాలు సిఫారసు చేశామన్నారు. ప్రతి గురువారం దవాఖానలో ఏర్పాటుచేసే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయులు

సమయపాలన పాటించాలి

నాగిరెడ్డిపేట, జనవరి 9: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడా రు. విద్యార్థిని చితకబాధిన ఘటనపై విచారణ పూర్తి చేసి నివేదికను డీఈవోకు పంపించామన్నా రు. ఆయా గ్రామాల పాఠశాలల్లో ఉపాధ్యాయు లు సమయపాలన పాటించడం లేదని.. బయట తిరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, సమయపాలన పాటించకుండా, బయటకు వెళ్తే సంబంధిత ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

డబుల్ బెడ్ రూం ఇండ్ల పరిశీలన

ఎల్లారెడ్డిలో డబుల్‌బెడ్ రూం ఇండ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 9: పట్టణ శివారులో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్లను ఆర్డీవో మన్నె ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ కలిసి గురువారం పరిశీలించారు. డబుల్‌బెడ్ రూం ఇండ్ల వద్ద జరిగిన మురికికాలువల నిర్మాణం, రోడ్ల పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వారితో పాటు తహసీల్దార్ అల్లం మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు జంగం నీలకంఠం అప్పు, నునుగొండ శ్రీనివాస్, మంచిర్యాల విద్యాసాగర్, అల్లం శ్రీను తదితరులున్నారు.

చెక్కుల పంపిణీ

పెద్ద కొడప్‌గల్, జనవరి 9 : మండలంలో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. 12మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, నాగునాథ్. సంజీవ్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

బండి నర్సింహులు

లింగంపేట, జనవరి 9: మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన బండి నర్సింహులు అదృశ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం పశువులను తీసుకుని వెళ్లిన నర్సింహులు తిరిగి ఇంటికి రాలేదని, పరిసరాల్లో గాలించినా ఆచూకీ లభించలేదన్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దకొడప్‌గల్, జనవరి 9 : మండలంలోని చావుని తండాకు చెందిన మధుసింగ్ ఇటీవల బైక్ అదుపు తప్పి గాయాలై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతుడి కుటుంబాన్ని స్థానిక ఎస్సై మహేందర్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనవెంట మష్నూ పటేల్, తండావాసులు ఉన్నారు.

11 నుంచి మండలస్థాయి క్రికెట్ టోర్నీ

నాగిరెడ్డిపేట, జనవరి 9: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మండలంలో ఈనెల 11వ తేదీనుంచి మండల స్థాయిక్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు ఇమామ్ తెలిపారు. టోర్నీలో పాల్గొనే టీమ్ సభ్యులు ఈనెల 10న సాయంత్రం 5 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంట్రీ ఫీజు వెయ్యి రూపాయలు ఉంటుందన్నారు. విన్నర్ టీమ్‌కు 7,777 రూపాయలు, రన్నర్ టీమ్‌కు 5,555 రూపాయల నగదుతో పాటు కప్ అందిస్తామని పేర్కొన్నారు. టీమ్‌ల నమోదు కోసం ఇమామ్ 9912150547, దత్తు 9959181006, 9398984307, మైను 8639311560 నంబర్లను సంప్రదించాలని సూచించారు.